# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 29 । నవంబర్ । 2022






### అమ్మకు నీరాజనం

రాజవొమ్మంగి: ఇంద్రకీలాద్రి (విజయవాడ) నుంచి సోమవారం రాజవొమ్మంగి వచ్చిన కనకదుర్గమ్మ అమ్మవారి రథానికి భక్తులు నీరాజనం పట్టారు. పసుపుకుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సింగంపల్లి, వట్టిగెడ్డ, గింజర్తి, ఎర్రంపాడు, నెల్లిమెట్లకాలనీ, లబ్బర్తి, లాగరాయి, కింద్ర, దూసరపాము మీదుగా రథం రాజవొమ్మంగి చేరుకుంది.



### వేటగాళ్ల ఆగడాలకు ఒకరి బలి

అడవి జంతువుల వేటకు అమర్చిన విద్యుత్ తీగలను ప్రమాదవశాత్తూ తాకి ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. 8లో

## న్యూస్‌రీల్

### 80 మంది పోడు సాగుదారులకు నోటీసులు



ఆదివాసీలకు నోటీసులు అందిస్తున్న అటవీశాఖ అధికారులు

ఎటపాక: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో అడవులు నరికి సాగు చేస్తున్న 80 మందికి అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వలస వచ్చిన కొన్ని కుటుంబాల వారు ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాలమడుగు సమీప అటవీ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరంతా కొన్నేళ్లుగా చెట్లు నరికి పోడు చేస్తున్నారు. వీరి ఆధీనంలో ఉన్న భూములు మన రాష్ట్రం పరిధిలోనివి. అడవులు అన్యాక్రాంతంపై స్పందించిన అటవీశాఖ అధికారులు గ్రామంలోని 80 మందికి ఈనెల 26న నోటీసులు జారీ చేశారు. వీరంతా సుమారు వంద హెక్టార్ల అడవిలో చెట్లను కొట్టి, చదును చేసి సాగుకు, నివాసాలకు ఉపయోగిస్తున్నట్టు గుర్తించామని నెల్లిపాక అటవీశాఖ రేంజర్ కొండలరావు తెలిపారు. నోటీసులు అందిన 15రోజుల్లోగా వారి వద్ద హక్కు పత్రాలు ఏమైన ఉంటే చూపాలని, లేకుంటే నివాసాలు, భూములు ఖాళీ చేసి వెళ్లాలని చెప్పారు.

### వచ్చేనెల 3వ వరకు బియ్యం పంపిణీ



చౌకదుకాణాలను తనిఖీ చేస్తున్న డీఎస్‌వో

సాక్షి, పాడేరు: ప్రధాన మంత్రి గ్రామీణ అన్న యోజన పథకం కింద వచ్చేనెల 3వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయనున్నట్టు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి(డీఎస్‌వో) శివప్రసాద్ తెలిపారు. నవంబర్ నెలకు సంబంధించి ఉచితంగా సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని పలు చౌకదుకాణాలను, గిడ్డంగులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉచిత బియ్యం పంపిణీపై తహసీల్దార్లు, పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

### ఎయిడెడ్ పాఠశాలల పరిశీలన



ఎయిడెడ్ పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

పెదబయలు: మండలంలో వనభంగి, రోగులపేట, పెదవంచరంగి గ్రామాల్లో ఎయిడెడ్ పాఠశాలలను డీఈవో పి.రమేష్ సోమవారం పరిశీలించారు. ఎయిడెడ్ పాఠశాలల విలీన ప్రక్రియలో భాగంగా ఆయా పాఠశాలలపై సమగ్ర నివేదికను అందించాలని అందిన ఆదేశాల మేరకు డీఈవో వాటిని పరిశీలించారు. సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

### మలేరియాపై అప్రమత్తం



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ రామనాథం

జి.మాడుగుల: మలేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని నేషనల్ వెక్టర్ బోర్న్ డీసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం(ఎన్‌వీబీడీసీపీ) రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. మండలంలో మలేరియా పరిస్థితులపై ఆరాతీశారు. రోగులు, అందిస్తున్న వైద్యం, మలేరియా నివారణకు చేపడుతున్న చర్యల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు.మలేరియా డీఎం సాంబమూర్తి, పీహెచ్‌సీ డాక్టర్ శశికాంత్, చింతపల్లి సబ్ యూనిట్ అధికారి చిట్టిబాబు పాల్గొన్నారు.

# అదిగో నవలోకం

ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామమైన జిల్లాలో ఇప్పుడు కొత్త టూరిస్టు స్పాట్‌లు వెలుగు చూస్తున్నాయి. అగుడు కదిపితే చాలు అద్భుత లోకాల్లో ఉన్న అనుభూతిని పంచుతున్నాయి. పాల సంద్రాన్ని తలిపించే మంచు మేఘాలతో పాటు ఇప్పుడు హొయలొలికే కొత్త జలపాతాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. అంతెత్తునుంచి ఎగసిపడే జలసవ్వడులు సుమధుర సంగీత ఝరిలో జలకాలాడిస్తున్నాయి. వాటిని సందర్శించేందుకు పర్యాటకులు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు భారీగా తరలిస్తున్న సందర్శకులు అయిష్టంగానే తిరిగి ఇళ్లకు వెళుతున్నారు.

- జిల్లాలో వెలుగుచూస్తున్న కొత్త టూరిస్టు స్పాట్‌లు
- తిలకించేందుకు పరుగులు తీస్తున్న సందర్శకులు



రణజిల్లేడ వద్ద పాలసముద్రాన్ని తలపిస్తున్న మంచు మేఘాలు

గూడెంకొత్తవీధి/అరకులోయ రూరల్: జిల్లాలో కొత్తగా వెలుగులోకి వస్తున్న టూరిస్టు స్పాట్‌లు సైతం సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఒకదానిని మించి ఒకటి అన్నట్టు ఉన్న కొత్త ప్రాంతాలను టూరిస్టులు పెద్ద సంఖ్యలో సందర్శిస్తున్నారు.

అనంతగిరి, లంబసింగి, తాజంగి, చెరువుల వెనం, పాడేరులోని వంజంగి మేఘాల కొండలే కాదు. అంతకు మించిన ప్రకృతి అందాలతో అలరారే ప్రాంతాలు అరకులోయ, గూడెంకొత్తవీధి తదితర మండలాల్లో చాలా ఉన్నాయి.

**సప్పర్ల రెయిన్ గేజ్**

గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న సప్పర్ల రెయిన్‌గేజ్ ప్రాంతం సముద్రమట్టానికి సుమారు 4000 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ 24 గంటలూ అత్యంత శీతల వాతావరణంతోపాటు మంచు మేఘాలు చాలా కిందనుంచి సందర్శకులను తాకుతూ వెళుతుంటాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన దారకొండ దారాలమ్మ ఆలయంతోపాటు సీలేరు వెళ్లే పర్యాటకులంతా తప్పనిసరిగా ఇక్కడ రెయిన్‌గేజ్ వద్దకు వెళ్లి కాసేపు ఉండి ఇక్కడ అందాలను ఆస్వాదిస్తారు. గతంలో అప్పటి ఉమ్మడి విశాఖ కలెక్టర్ యువరాజ్ ఈ ప్రాంతాన్ని సందర్శించి పర్యటకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత సీజనులో దూరప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తున్న పర్యాటకులసంఖ్య పెరుగుతోంది. ఈ ప్రాంతాన్ని టెంపుల్ టూరిజం కింద అభివృద్ధి చేస్తామని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు.



పచ్చదనంతో ఉన్న అడవి అందాలు

**రణజిల్లేడలో..**

ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో మరో అద్భుతమైన టూరిజం స్పాట్ చూపరులకు కనువిందు చేస్తోంది. పద్మాపురం పంచాయతీ రణజిల్లేడ జలపాతం ఇప్పటికే ప్రాచుర్యం పొందగా, దాని సమీపంలో అటవీ ప్రాంతంలో ప్రకృతి అందాలు పర్యాటకులను పరవశింప చేస్తున్నాయి. ఇక్కడి మంచు సోయగాలు, సూర్యోదయ అందాలు ఆకర్షిస్తున్నాయి.

**మాడగడలో వ్యూ పాయింట్**

కొద్ది రోజుల నుంచి పర్యాటకులతో సందడిగా మారిన మాడగడ సన్ రైజ్ వ్యూ పాయింట్ సోమవారం పర్యాటకులతో కిటకిటలడింది. వివిధ ప్రాంతల నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు, తెల్లవారుజామునలో చల్లని వాతవరణంలో మంచు అందాలను వీక్షించి ఫొటోలు తీసుకుంటూ గడిపారు.

### మూడు కొత్త జలపాతాలు

గూడెంకొత్తవీధికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో కొత్తపల్లికి సమీపంలో దోనుగుమ్మల జలపాతం కొత్తగా వెలుగులోకి వచ్చింది. ఇక్కడికి వెళ్లేందుకు కొద్దిదూరం సీసీ రోడ్డు నిర్మిస్తే చాలు ఈప్రాంతానికి పర్యాటకంగా ఆదరణ లభించే అవకాశం ఉంది.

దోనుగుమ్మల జలపాతానికి రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని పంచాయతీరాజ్ జేఈ జ్యోతిబాబు తెలిపారు. జలపాతాలకు వెళ్లేందుకు రహదారి నిర్మాణానికి రూ.19లక్షలు మంజూరు చేసినట్టు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. కార్యరూపం దాల్చితే త్వరలోనే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సంపంగిగొంది జలపాతం కూడా సందర్శకులను ఆకట్టుకుంటోంది. అనంతగిరి మండలం చిట్టంపాడు జలపాతం ఇటీవల వెలుగుచూసింది. అక్కడికి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వెళుతున్నారు.



దోనుగుమ్మల జలపాతం

## జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి అవార్డు

**గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కలెక్టర్, పీవో**

సాక్షి, పాడేరు: గిరిజనులకు అందిస్తున్న సేవలకు, విస్తృతంగా శిబిరాలు నిర్వహించి రక్తం సేకరించినందుకు గాను జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి అవార్డు లభించింది. సోమవారం నిర్వహించిన రెడ్‌క్రాస్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ అవార్డు అందుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా మరిన్ని సేవలను అందించాలని గవర్నర్ ఈ సందర్భంగా సూచించారు. కలెక్టర్, పీవో అభ్యర్థన మేరకు... జిల్లాకు రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా మహాప్రస్తానం వాహనం మంజూరు చేస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. వచ్చేనెలలో పాడేరులో నిర్వహించే వైద్య శిబిరం, రక్తదాన శిబిరాల్లో పాల్గొనున్నట్టు గవర్నర్ తెలిపారు.



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పీవో గోపాల కృష్ణ

## పకడ్బందీగా ఫ్యామిలీ డాక్టర్

**డీఎంహెచ్‌వో జమీల్ బాషా**

చింతపల్లి/జి.మాడుగుల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమీల్ బాషా ఆదేశించారు. సోమవారం లోతుగెడ్డ,లంబసింగి, జి.మాడుగుల పీహెచ్‌సీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులతో పాటు సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ రోగులు, గర్భిణులు,బాలింతలకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలన్నారు. తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ సర్వీసులను, వాటి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అంబులెన్సు రికార్డులను తనిఖీ చేసి, గర్భిణుల తరలింపు,హై రిస్కు ఉన్న గర్భిణులను వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల, లోతుగెడ్డ,లంబసింగి పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ శశికాంత్,లక్ష్మీకాంత్,మారెమ్మ, పాడేరు సబ్‌యూనిట్ అధికారి ధనుంజయ్, ఎంపీహెచ్‌ఈవో ఎస్.ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్ రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమీల్ బాషా

## మూగజీవాల ప్రాణాలు కాపాడండి

**స్పందనలో పీవోకు కింటుకూరు గిరిజనుల వినతి**

రంపచోడవరం: పెద్దపులి బారి నుంచి తమ పశువులను కాపాడాలని ఆకూరు పంచాయతీ వాసులు రంపచోడవరం పీవో సూరజ్ గనోరేను కోరారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. కింటుకూరు గ్రామంలో సుమారు పది పశువులను పెద్దపులి చంపేసిందని సర్పంచ్ కత్తుల వరలక్ష్మి, ఎంపీటీసీ నర్రి పాపారావు,కత్తుల కృష్ణారెడ్డి, గ్రామస్తులు పీవోకు తెలిపారు. పెద్ద పులిబారి నుంచి మూగజీవాలను కాడాలని వారు కోరారు. మారేడుమిల్లి మండలం బందం రోడ్డు నిర్మించాలని సర్పంచ్ పల్లాల శిల్పారాణి కోరారు. అడ్డతీగల మండలం పులిగోగుల లో వీఎస్ఎస్ ద్వారా వెదురు నరికిన డబ్బులు ఇప్పించాలని గిరిజనులు కోరారు. పీవో మాట్లాడుతూ స్పందనలో 70 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ శ్రీనివాస్ రావు, ఎస్‌డీసీ ఎం.వెంకటేశ్వరరావు, ఈఈ డేవిడ్ రాజు, ఎండీ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సూరజ్ గనోరే, శుభం బన్సల్

## ఆన్‌లైన్ కోర్సులపై అవగాహన అవసరం

పాడేరు రూరల్ : డిజిటల్ క్లాసులు, ఆన్‌లైన్ కోర్సులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జవహర్ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.రామ్‌గోపాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గణిత, భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంప్యూటర్ పరిజ్ఞానంతో సాంకేతిక విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రభుదాస్, రామకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామ్‌గోపాల్

## 4588 మంది రైతుల ఖాతాల్లో రూ.62.27 లక్షలు జమ

**జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి**

పాడేరు రూరల్: జిల్లాలో 4,588 మంది రైతుల ఖాతాల్లో రూ.62.27 లక్షల సున్నా వడ్డీ రాయితీ సొమ్ము జమ అయినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. 2020–21 సంవత్సరం రబీ కాలానికి సంబంధించి 669 మంది రైతులకు రూ.10.27 లక్షలు, 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1,077 మంది రైతులకు రూ.19 లక్షలను ప్రభుత్వం జమ చేసిందన్నారు. గత ఏడాదికి సంబంధించిన 2,842 మంది రైతులకు సున్నా వడ్డీ రూ.33లక్షలను జమ చేశారని చెప్పారు.పలువురు రైతులకు సోమవారం ఆయన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి.ఎస్. నందు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్ కుమార్ రావు, సహాయ సంచాలకులు జి.వి.విజయ్‌కుమార్, ఎం.వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న దయానిధి

# అందుబాటులో ఆర్థోపెడిక్ సేవలు

**రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు**

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు యాక్సిడెంట్ కేసుల్లో అత్యవసర వైద్యం సేవలతో పాటు, ఆర్థోపెడిక్ సర్జరీ కోసం రాజమహేంద్రవరం, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాల్సి వచ్చేది. అత్యవసర వైద్య సేవలు అందాల్సిన సమయంలో సగం కాలం అక్కడికి చేరుకునేందుకే సరిపోయేది. అలాంటి పరిస్థితులకు చెక్ పెడుతూ రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలోనే ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందుబాటులో తీసుకువచ్చారు.

**పది యాక్సిడెంట్ కేసులకు సర్జరీలు**

ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ పది యాక్సిడెంట్ కేసులకు సర్జరీలు నిర్వహించారు. సాధారణ సర్జరీలతో పాటు ఆరోగ్యశ్రీలో కూడా సర్జరీలు చేస్తున్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేసిన తరువాత తొలిసారిగా ఆర్థోఫెడిక్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సుధాకర్ పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలు బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రంపచోడవరానికి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేశారు. ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఏరియా ఆస్పత్రిలో ప్రసూతి సేవలు అందుబాటులోకి రావడంతో గర్భిణులకు మెరుగైన సేవలు అందుతున్నాయి.



ఆపరేషన్ చేయించుకున్న రామకుమారి



సర్జరీ అనంతరం రోగితో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

### వేరే ప్రాంతాలకు వెళ్లనవసరం లేదు



తాజాగా ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల ఆర్థోఫెడిక్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.అన్ని రకాల ఆపరేషన్‌లు ఇక్కడే చేస్తున్నాం. ఆరోగ్యశ్రీలో కూడా ఆర్థోపెడిక్ ఆపరేషన్‌లు చేయించుకోవచ్చు. ఏజెన్సీ వాసులు ఎముకల ఆపరేషన్ కోసం రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్లాల్సిన అవసరం లేదు.

–డాక్టర్ సుధాకర్, ఆర్థోఫెడిక్ సర్జన్, రంపచోడవరం ఏరియా ఆస్పత్రి

### ఆపరేషన్ బాగా చేశారు..

కాలికి దెబ్బతగిలి విరిగిపోయింది. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలోనే ఆపరేషన్ చేశారు. అంతా మంచిగా జరిగింది. వార్డులో ఉన్నాను. మూడు రోజుల తరువాత ఇంటికి పంపుతామన్నారు. బయట ఆస్పత్రి వెళ్లి ఇబ్బందులు పడే పరిస్థితి తప్పింది. –మిర్తివాడ రామకుమారి, చెరువుపాలెం,రంపచోడవరం మండలం



కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినుల మానవహారం

### ఇంకానా... ఇక సహించం

మహిళలపై దాడులు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులను ఇక సహించకూడదని, ఆ విషయంలో విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వాటికి చెక్ పెట్టవచ్చని అధికారులు సూచించారు. ఐసీడీఎస్ సీడీపీవో బాల చంద్రమణి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులతో ర్యాలీ, మానవహారం నిర్వహించి, మహిళాచట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైంగిక దాడులకు వ్యతిరేకంగా విద్యార్థినులు నినాదాలు చేశారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తూ వచ్చే నెల 23వ తేదీవరకు ర్యాలీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జంపరంగి చిన్నారావు,ఐసీడీఎస్ సిబ్బంది,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- హుకుంపేట

## కుస్తీ మే సవాల్

**నేడు కొయ్యూరులో జిల్లాస్థాయి పోటీలు**



ప్రాక్టీస్ చేస్తున్న బాలురు (ఫైల్)

కొయ్యూరు: కుస్తీ పోటీలకు కొయ్యూరు మరోసారి వేదికవుతోంది. ఇప్పటి వరకు రెండుసార్లు జిల్లా స్థాయి కుస్తీ పోటీలను ఇక్కడ నిర్వహించారు. తాజాగా మూడోసారి కూడా ఉమ్మడి జిల్లాస్థాయి కుస్తీ పోటీలను మంగళవారం సీఏహెచ్ పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు విశాఖ ఉమ్మడి జిల్లా (అల్లూరి,అనకాపల్లి,విశాఖ జిల్లాల నుంచి) క్రీడాకారులు పాల్గొనున్నారు. మొత్తం 215 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. వీరిలో బాలికలు 110 మంది, బాలురు 105 మంది ఉన్నారు. మరో 15 మంది అధికారులు రానున్నారు. వీరందరి కోసం సీఏహెచ్ పాఠశాలలో భోజన, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. 2014లో మొదటి సారిగా ఇక్కడ కుస్తీ అకాడమీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గిరిజన బాలబాలికలు పలు కుస్తీ పోటీల్లో పతాకాలు సాధించారు. జాతీయ స్థాయిలో కూడా పాల్గొన్నారు. ఖేలో ఇండియా పోటీల్లో కూడా పాల్గొన్నారు. కుస్తీ శిక్షణలో కొయ్యూరు అకాడమీకి మంచి పేరు వచ్చింది. దీంతో ఇక్కడ తరచూ కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు.

# జ్యోతీరావు పూలే సేవలు చిరస్మరణీయం


జి.మాడుగులలో మహాత్మ జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


హుకుంపేట మండలం నిమ్మలపాడులో జ్యోతీరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం


అడ్డతీగల మండలం ఎల్లవరంలో పూలే చిత్రం వద్ద నివాళులర్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

**జి.మాడుగుల:** అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతీరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. జ్యోతీరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సచివాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారన్నారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీలు సన్యాసిదొర, చిన్నారావు నాయకులు గంగరాజు, కల్యాణ్, వలసయ్య, కొండబాబు, రామకృష్ణ, శ్రీను, శ్రీనివాసనాయుడు, లక్ష్మణ్, వరలక్ష్మి, హాస్పెన్‌బేబి, అన్నపూర్ణ తదితరలు పాల్గొన్నారు.

**హుకుంపేట:** మండలంలోని నిమ్మలపాడులో జరిగిన జ్యోతీరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ బడుగు వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అడ్డతీగల:** ఎల్లవరంలో జరిగిన జ్యోతీరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారన్నారు. జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, సర్పంచ్ నూకరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చలిమంటతో చిన్నారికి గాయాలు

**రాజవొమ్మంగి :** చలికాగేందుకు మంట దగ్గరకు వెళ్లిన చిన్నారి గౌన్‌కు నిప్పు అంటుకోవడంతో తీవ్ర గాయాలపాలయ్యింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి రాజవొమ్మంగిలో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన వెచ్చం అమ్మాజి (11) ఇంటి ముంగిట వేసిన మంట వద్ద చలి కాగుతుండగా ఆమె ధరించిన సిల్క్ గౌన్‌కు అగ్నికీలలు తగిలాయి. ఒక్కసారిగా మంటలు ఎగసి పడి అమ్మాజికి ఛాతి, పొట్ట, తొడలపై కాలిన గాయాలయ్యాయి. ఆ బాలికను తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స జరిపి 108 సహాయంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆ బాలిక అక్కడ చికిత్స పొందుతోంది. బాలికకు 25 శాతం కాలిన గాయాలయ్యాయని సిబ్బంది తెలిపారు.

## 12 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

**రోలుగుంట :** బీబీ పట్నం–వడ్డిప రూట్‌లో బైకుపై గంజాయిని తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్టు ఎస్‌ఐ బి.నాగకార్తీక్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, 12 కిలోల గంజాయిని, రెండు మొబైల్స్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ మార్కెట్లో రూ.40 వేలు ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

## బైక్ ప్రమాదంలో యువకుడి మృతి

**పాయకరావుపేట :** మోటారు బైక్ నుంచి పడిపోయి ఓ వ్యక్తి మృతి చెందినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. వివరాలివి. రాజగోపాలపురం గ్రామానికి చెందిన బత్తిన వీరేంద్ర (22) రాజగోపాలపురం నుంచి శ్రీరాంపురం గ్రామానికి వెళ్లి తిరిగి తన ఇంటికి వెళ్తుండగా ఎస్.నర్సాపురం గ్రామం వద్ద అడ్డంగా కుక్క రావడంతో బైక్ పై నుంచి పక్కనే వున్న కాలువలోకి పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



# రేంజర్ హత్య పాశవిక చర్య

**రంపచోడవరం:** తెలంగాణ అటవీ క్షేత్రాధికారి శ్రీనివాసరావు హత్యకు నిరసనగా అటవీ అధికారులు, సిబ్బంది సోమవారం రంపచోడవరంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రంపచోడవరం, కాకినాడ, రాజమహేంద్రవరం డివిజన్‌లకు చెందిన అటవీ సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీని రంపచోడవరం సబ్ డీఎఫ్ఓ ఎస్.భరణి ప్రారంభించారు. అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. రేంజర్‌పై హత్య పాశవిక చర్య అని పలువురు చెప్పారు. ఐటీడీఏ వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను ఏపీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం శాఖ ప్రధాన కార్యదర్శి ఎ.సునీత్‌కుమార్, ఏపీ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్యామ్‌కుమార్, శేఖర్‌బాబు, రేంజర్లు కరుణాకర్, దుర్గాకుమార్‌బాబు, అబ్బాయిదొర, బీవీడీ ప్రసాద్, జి.ఉషారాణి కలిశారు. అటవీ సిబ్బంది ప్రాణరక్షణ, అటవీ సంరక్షణ , ఆయుధాలు సమకూర్పు తదితర అంశాలతో కూడిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఐటీడీఏ కార్యాలయం వద్ద రెంజర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. భాస్కర్‌కృష్ణ, రాములమ్మ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అటవీ అధికారులు

## బైకు అదుపు తప్పి ఒకరికి గాయాలు

**పాడేరు రూరల్ :** జోగులపుట్టు వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. జి.ముంచంగిపుట్టు పంచాయతీ జల్లిపల్లి గ్రామానికి చెందిన వంతాల రాజుబాబు(40) అనే గిరిజనుడు సోమవారం పాడేరు నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా గుత్తులపుట్టు సమీపంలో జోగులపుట్టు జంక్షన్ వద్ద వాహనం అదుపు తప్పింది. రాజుబాబు తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అతడికి ప్రాథమిక చికిత్స చేసి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన గిరిజనుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

## వారపు సంతలో సీఆర్‌పీఎఫ్ సేవలు


పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

**వై.రామవరం:** సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42–బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. సుమారు 175 మందికి భోజన సదుపాయం కల్పించినట్టు అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు చెప్పారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

**చీడికాడ :** పదో తరగతి చదువుతున్న మైనర్ బాలిక రెండురోజులుగా కనబడడం లేదని ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ కె.సుధాకరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చినగోగాడకు చెందిన అదట్రాపు మాధవి అనే బాలిక ఈ నెల 26వ తేదీ రాత్రి 8.30 గంటల నుంచి కనిపించడం లేదని తండ్రి అప్పారావు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు

**జి.మాడుగుల:** జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించి సకాలంలో వేతనాలు అందించి సోషల్ ఆడిట్‌లో నమోదయ్యే విధంగా పనిచేయాలని ల్లా డ్వామా పీడీ రమేష్ రామన్, జిల్లా విజిలెన్స్ అధికారి( డీవీవో) రమాదేవి తెలిపారు. మండల కేంద్రంలోఉపాధి హామీ పథకం కార్యాలయ ఆవరణలో సోమవారం ఉపాధి హామీ పథకం కింద 2020–21, 2021–22 సంవత్సరాల్లో చేపట్టిన రూ.28.30కోట్లు వివిధ పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. 17పంచాయతీల్లో గిరిజన గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్, టీడబ్ల్యూయూ, కాఫీ, అటవీ తదితర శాఖల ద్వారా గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం, కందకాలు, చెరువులు తదితర పనులు ఉపాధిహామీ పథకం కింద చేపట్టారు. గ్రామస్థాయిలో సోషల్ అడిట్ క్షేత్రసాయి అధికార్లు చేపట్టి అనంతరం మండలస్థాయి ప్రజావేదిక నిర్వహించారు. 2020–21సంవత్సరంలో రూ.16.78 కోట్లు, 2021–22 సంవత్సరానికి రూ.11.52 కోట్లతో పనులు చేపట్టారు. టీడబ్ల్యూ శాఖలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి సుమారు కోటి రూపాయల వివరాలు అధికారులు చూపించాల్సి ఉందని, చనిపోయిన వారి పేరుతో కొంతమంది పనులు చేపట్టారని, పనులు చేసిన వారికి వేతనాలు ఇవ్వలేదని, జాబ్‌కార్డులో ఉన్న వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని, ఆయన పేరుతో వేతనం జమ అయిందని, బినామీ పేరుతో పనులు చేసిన కూలీ సొమ్ము అందలేదని ప్రజావేదికలో బయటపడింది. ఆయా నగదును రికవరీ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్లాంటేషన్‌లో కొన్ని మొక్కలు లేకపోవడం, నేమ్ బోర్డులను ఏర్పాటు చేయకపోవటం వంటివి ప్రజావేదిక దృష్టికి వచ్చాయి. వారు మాట్లాడుతూ మండలంలో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ద్వారా రెండు రోజుల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో మళ్లీ మొక్కలు నాటాలని, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ప్రాధాన్యతా భవనాలను త్వరితగతని పూర్తి చేసి సకాలంలో బిల్లులు చెల్లించాలని, ప్రతీ జాబ్‌కార్డుదారుడికి 100 రోజుల పనిదినాలు పూర్తి చేయించాలన్నారు. పని దినాలు సకాలంలో పూర్తి చేసేందుకు ఉపాధిహామీ సిబ్బంది దృష్టి సాధించాలని వారు తెలిపారు.

ఎంపీపీ కొర్రా పద్మ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఏపీడీ గిరిబాబు, ఎంపీడీవో లోహిత్ జయసాగర్, ఎస్ఆర్‌పీలు రామచంద్రరావు, మురధన్, ఎంపీటీసీలు విజయకుమారి, అప్పలరాజు, ఈశ్వరరావు, సర్పంచ్ మాలన్న, ఏపీవో రామేశ్వరావు, పీఆర్ఏఈ వెంకటలక్ష్మి, టీడబ్ల్యు ఏఈ జబ్బర్, సిబ్బంది పాల్గొన్నారు


ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా డ్వామా పీడీ రమేష్‌రామన్, జిల్లా విజిలెన్స్ అధికారి రమాదేవి



# వేటగాళ్ల ఆగడాలకు ఒకరి బలి


శ్రీరామ్‌రెడ్డి మృతదేహం

- జంతువుల వేట కోసం విద్యుత్ తీగల ఏర్పాటు
- తీగలు తగిలి ఒకరి మృతి, మరొకరికి గాయాలు


సంఘటన స్థలాన్ని పరిశీలించి, గ్రామపెద్దలను విచారిస్తున్న సీఐ రాంబాబు

**వై.రామవరం :** అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలంలో అడవి జంతువుల వేటకు అమర్చిన విద్యుత్ తీగలను ప్రమాదవశాత్తూ తాకి ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అడ్డతీగల సీఐ వై.రాంబాబు తెలిపిన వివరాలివి. యర్రంరెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని నువ్వుగంటిపాలెం, కోట సచివాలయం పరిధిలోని బుల్లోజిపాలెం గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో అడవి జంతువుల వేటకోసం గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలను అమర్చారు. అయితే యర్రంరెడ్డిపాలెం పంచాయతీ సింహాద్రిపాలెం గ్రామానికి చెందిన ఏడుగురు గిరిజనులు ఆదివారం మధ్యాహ్నం అడవి పక్షులు, పిల్లుల వేటకు విద్యుత్ తీగలు అమర్చిన కొండవైపు వెళ్లారు. ఆదివారం సాయంత్రం వేటకు వెళ్లిన వారిలో యాట్ల శ్రీరామ్‌రెడ్డి(51), యాట్ల శంకురురెడ్డి (28) ప్రమాదవశాత్తూ ఆ విద్యుత్ తీగెలపై పడగా శ్రీరామ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన శంకురురెడ్డిని ఆదివారం రాత్రి 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఆలస్యంగా ఈ సమాచారాన్ని సోమవారం ఉదయం స్థానిక పోలీసుస్టేషన్‌కు గ్రామపెద్దలు అందించారు. అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. తహసీల్దార్ కె.సుధాకర్, గ్రామపెద్దల సమక్షంలో మృతదేహన్ని పరిశీలించి, అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం తరలించినట్టు సీఐ తెలిపారు. దీనిపై విచారణ నిర్వహించి, కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఇటువంటి నేరాలకు పాల్పడుతున్న నిందితులు ఎంతటివారైనా క్షమించేది లేదని సీఐ హెచ్చరించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, గ్రామపెద్దలు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబీకులను ఓదార్చారు.

## పటిష్టంగా గిరిజన చట్టాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

**రంపచోడవరం:** గిరిజన సంఘం రెండవ జిల్లా మహాసభలు సోమవారం రంపచోడవరం స్వర్ణ భారతి మైదానంలో జరిగాయి. మహాసభలో సుమారు 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించారు.

ఉద్యమ నాయకులు ,మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, బొజ్జిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకులు సీతారాం, సురేంద్రలు పాల్గొన్నారు. సభలో పలు తీర్మానాలు చేశారు. జీవో నంబర్– 52ను రద్దు చేయాలి, జీవో నంబర్–3కు చట్టబద్ధత కల్పించాలని, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని తీర్మానం చేశారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలనానరు. నాయకులు కిరణ్, వాణిశ్రీ, వెంకట్, సిరిమిల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కంటి వైద్య పరీక్షలు


వైద్యులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య

**ఎటపాక:** మండలంలోని నెల్లిపాక పీహెచ్‌సీ పరిధిలో ఈనెల 29 నుంచి డిసెంబర్ 31 వరకు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య సోమవారం తెలిపారు. ఆయన పీహెచ్‌సీని సోమవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని ఏడు గ్రామ సచివాలయాలకు సంబంధించిన గ్రామాల్లో ఆప్తాలమిక్ డాక్టర్ పార్వతీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కంటి సమస్యలున్న వారికి పరీక్షలు చేసి, 60 సంవత్సరాల వయస్సున్న వారికి కళ్లద్దాలు అందజేస్తామని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యులు ప్రత్యూష్, విష్ణుప్రియ పర్యవేక్షిస్తారని తెలిపారు.

## 8 మంది సారా విక్రేతల బైండోవర్

**నక్కపల్లి :** మండలంలో వివిధ గ్రామాల్లో సారా తయారు చేసి విక్రయిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సోమవారం ఎక్సైజ్ పోలీసులు చినదొడ్డిగల్లు, వేంపాడు, జి.జగన్నాథపురం గ్రామాలకు చెందిన 8 మందిపై పాయకరావుపేట ఎస్ఈబీ అధికారులు కేసులు నమోదు చేశారు. వారందరిని సోమవారం నక్కపల్లి తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి వద్దకు తీసుకువచ్చి బైండోవర్ చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు


లోతుగెడ్డ జంక్షన్‌లో చెత్తను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కుమార్


రాజవొమ్మంగిలో కార్యదర్శులతో సమావేశమైన డీపీఓ కొండలరావు

**చింతపల్లి:** మండలంలోని పెదబరడ పంచాయతీలో డీఎల్‌పీవో కుమార్ సోమవారం పర్యటించారు. లోతుగెడ్డ జంక్షన్ వద్ద రహదారిపై చెత్త పేరుకపోయి ఉండడాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగునకు నిధులు మంజూరుచేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆయన మండిపడ్డారు. పంచాయతీల్లో పారిశుధ్యం లోపిస్తే కార్యదర్శులపై వేటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులున్నారు.

**రాజవొమ్మంగి:** మండల కేంద్రంలోని సచివాలయంలో రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల గ్రామ కార్యదర్శులతో డీపీఓ కొండలరావు సోమవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతు తాగు నీటి పథకాలను క్లోరినేషన్ చేసి, శుభ్రం చేయాలని, సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

జిల్లాలోని 22 మండలాల్లోని పంచాయతీలకు రూ. 21 కోట్ల మేర 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని, పారిశుధ్య కార్మికులకు రూ.2.21 కోట్లు బకాయి వేతనాలు అందజేసినట్టు చెప్పారు. అనంతరం గ్రామంలోని స్థల వివాదంపై దర్యాప్తు చేపట్టారు. డీఎల్‌పీఓ వివేక్ పాల్గొన్నారు.